kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

గురువారం • 23-04-2026

పేజీలు: 5

360° SINGLE TOPIC

హైడ్రా

HYDRAA

హైడ్రా.. హైదరాబాద్‌లో ఈ పేరు మార్మోగిపోతున్నది.. తరచూ వార్తల్లో నిలుస్తున్నది. ఓవైపు ప్రశంసలు పొందుతున్నది.. మరోవైపు విమర్శలు మూటగట్టుకుంటున్నది.

ఎన్నో ఏండ్లుగా కబ్జాదారుల కబంధ హస్తాల్లో బందీ అయిన ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులకు హైడ్రా విముక్తి కల్పిస్తున్నది. ఆక్రమణలు తొలగిస్తూ వాటి చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నది. రాజకీయ నాయకుల అండదండలతో బడా బాబులు సాగిస్తున్న కబ్జాలను అడ్డుకుంటున్నది.

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ భూములు, మూసీ పరీవాహక ప్రాంతాల్లో పేదలు కట్టుకున్న ఇండ్లను కూడా హైడ్రా తొలగిస్తున్నదన్న వాదన ఉన్నది. పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేతలు చేపట్టడంపై వ్యతిరేకత వస్తున్నది. హైడ్రా తీరుపై హైకోర్టు కూడా పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసింది.

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు, చెరువులను చెరబట్టారని.. పార్కులు, నాలాలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లనూ కబ్జా పెట్టారని.. ఈ ఆక్రమణలన్నీ తొలగించేందుకే హైడ్రా ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. 'హైడ్రా అంటే పేదల ఇండ్లు కూల్చడమేనా? మూసీ వెంబడి 10 వేల మంది పేదల ఇళ్లు కూలగొట్టడం ధర్మమేనా? మేం అధికారంలోకి రాగానే హైడ్రాను పీకి చెరువులో పడేస్తాం' అని కేసీఆర్ అంటున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం..

సెంట్రల్ డెస్క్, కలం

## అక్రమార్కుల గుండెల్లో..

# హైడ్రా హడల్!

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులకు విముక్తి

పేదల విషయంలో విమర్శలు.. పెద్దల విషయంలో ప్రశంసలు

నోటీసులు లేకుండా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం

### హైడ్రా స్వాధీనం చేసుకున్న భూముల వివరాలివీ..

మొత్తం భూములు: 1,000 ఎకరాలకు పైగా

విలువ: 50,000 కోట్లకు పైనే



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో అక్రమ భవనాన్ని కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

| ప్రభుత్వ భూములు: | రోడ్లు: | చెరువులు: | పార్కులు: | నాలాలు: | ఫుట్‌పాత్‌లు, ఇతరత్రా: |
|---|---|---|---|---|---|
| 424 ఎకరాలు | 218 ఎకరాలు | 233 ఎకరాలు | 25.65 ఎకరాలు | 15 ఎకరాలు | 75 ఎకరాలు |

(నోట్: 2025 అక్టోబర్ వరకు ఉన్న సమాచారం)

kalamdaily.com
Follow on: Kalamtelugu

## హైడ్రా ఏర్పాటు ఎప్పుడు? ఎందుకు?

హైదరాబాద్‌లో ఒకప్పుడు వందలాది చెరువులు, కుంటలు, పార్కులు ఉండేవి. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉండేవి. కానీ కాలక్రమంలో అవి కబ్జాలకు గురయ్యాయి. ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. నాలాలు కూడా కుంచించుకుపోయాయి. వర్షాకాలంలో వరదలు కామన్ అయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. చెన్నై, బెంగళూర్, ముంబై లాంటి పరిస్థితి రావొద్దని.. హైదరాబాద్‌లోని ఆక్రమణలన్నింటినీ తొలగించాలని నిర్ణయించింది. జీహెచ్ఎంసీలోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ (హైడ్రా) పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది.

- 2024 జులై 19న హైడ్రా ఏర్పాటైంది. దీనికి ప్రభుత్వం విస్తృత అధికారాలు కల్పించింది. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు హైడ్రాను విస్తరించింది.
- చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడడం.. కబ్జాలను తొలగించడం.. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం.. హైడ్రా ప్రధాన లక్ష్యాలు.
- ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపుతో పాటు వరదలు, అగ్నిప్రమాదాల లాంటి విపత్కర పరిస్థితుల్లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విధులు కూడా నిర్వహిస్తుంది.
- హైడ్రాలో ముఖ్యమైనవి మూడు విభాగాలు. అవి.. అసెట్ ప్రొటెక్షన్ వింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వింగ్, లాజిస్టిక్ సపోర్ట్ వింగ్.
- హైడ్రా చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. మున్సిపల్, రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖల మంత్రులు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, జీహెచ్ఎంసీ మేయర్, సీఎస్, డీజీపీ, మున్సిపల్, రెవెన్యూ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ హెడ్, హైడ్రా కమిషనర్ సభ్యులుగా ఉంటారు.
- ప్రస్తుతం హైడ్రా కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ ఉన్నారు.


పాతబస్తీలోని బమ్‌రుఖ్‌నుద్దౌలా చెరువు

# చెరువులు, కుంటలకు పునరుజ్జీవం

హైడ్రా ఏర్పాటై దాదాపు రెండేండ్లు అవుతున్నది. ఈ రెండేండ్లలో ఎన్నో చెరువులు, కుంటలు, నాలాలను కాపాడింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలసిన ఆక్రమణలను తొలగించింది. ఆ చెరువులను సుందరీకరించే పనులనూ చేపట్టింది. చెత్తకుప్పలు, ముళ్లకంపలు, గుర్రపు డెక్క తొలగించి చెరువులను సుందరీకరిస్తున్నది. జనం మార్నింగ్, ఈవెనింగ్ వేళల్లో వాకింగ్‌కు వెళ్లేలా, పచ్చని వాతావరణంలో సేదతీరేలా చెరువు కట్టలను తీర్చిదిద్దుతున్నది.

- హైడ్రా ఏర్పాటైన నాటి  నుంచి ఇప్పటి వరకు 50కి పైగా చెరువుల్లో ఆక్రమణలను తొలగించింది. దాదాపు 275 ఎకరాలను చెర విడిపించింది.
- 1960 నాటి సర్వే ప్రకారం బాగ్‌అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట విస్తీర్ణం 16.13 ఎకరాలు. మహిళలు అక్కడ బతుకమ్మ ఆడి, అందులో నిమజ్జనం చేసేవారు. కాలక్రమంలో చెరువే లేకుండా పోయింది. 5.15 ఎకరాలు మిగలగా, అదీ ప్రైవేట్ వ్యక్తి చేతుల్లోకి వెళ్లిపోయింది. హైడ్రా రంగంలోకి దిగి ఐదెకరాలను స్వాధీనం చేసుకుని, బతుకమ్మ కుంటను పునరుద్ధరించింది.
- మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 14 ఎకరాకులకు కుంచించుకుపోయిన చెరువును 30 ఎకరాలకు విస్తరించింది.
- కూకట్‌పల్లిలోని నల్ల చెరువు ఆక్రమణలను కూడా తొలగించి, విస్తీర్ణాన్ని 16 ఎకరాల నుంచి 30 ఎకరాలకు పెంచింది.
- పాతబస్తీలోని బమ్‌రుఖ్‌నుద్దౌలా చెరువు ఒకప్పుడు 104 ఎకరాల్లో విస్తరించి ఉండేది. ఇది మంచి నీటి చెరువు. కాలక్రమంలో ఆక్రమణల కారణంగా 17.05 ఎకరాలకు తగ్గింది. చివరికి 4.12 ఎకరాలే మిగిలింది. హైడ్రా రంగంలోకి దిగి, మళ్లీ 17 ఎకరాలకు విస్తరించింది.
- హైడ్రా కేవలం ఆక్రమణల తొలగింపుతోనే ఆగిపోవడం లేదు. కబ్జాదారుల చెర విడిపించిన చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతున్నది. మొదటి దశలో దాదాపు రూ.107 కోట్లతో ఆరు చెరువులను సుందరీకరిస్తున్నది. ఇప్పటికే బతుకమ్మ కుంట, బమ్‌రుఖ్‌నుద్దౌలా, కూకట్‌పల్లి నల్ల చెరువులను అభివృద్ధి చేసింది. మాదాపూర్‌లోని సున్నం చెరువు, ఉప్పల్‌లోని నల్ల చెరువును అభివృద్ధి చేస్తున్నది. రెండో విడతలో 14 చెరువుల పునరుద్ధరణ పనులు చేపడుతున్నది.


బతుకమ్మకుంట చెరువు


అమీన్‌పూర్‌లోని పార్క్ స్థలానికి ఫెన్సింగ్ వేస్తున్న హైడ్రా సిబ్బంది

## పార్కులకు ప్రాణం

హైదరాబాద్‌లో పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు సేదతీరడానికి పార్కులు కరువయ్యాయి. ఉన్న కొన్ని పార్కులనూ కబ్జాదారులు చెరబట్టారు. హైడ్రా రంగంలోకి దిగి పార్కులకు మళ్లీ ప్రాణం పోస్తున్నది. కబ్జాకు గురైన పార్కులను రక్షిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నది.

- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో శ్రీ వెంకటరమణ కాలనీ పేరుతో 15 ఎకరాల్లో వెంచర్ వేశారు. అందులో 1.02 ఎకరాలు, 6 గుంటల్లో రెండు పార్కులు ఉన్నాయి. అవి ఆక్రమణకు గురవుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదుతో ఈ నెల 2న హైడ్రా ఆపరేషన్ చేపట్టింది. రూ.47 కోట్ల విలువైన భూమిని కాపాడి ఫెన్సింగ్ వేసింది.
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామంలో 1987లో 60 ఎకరాల్లో ఓ లేవుట్ వేశారు. అందులో 12 గుంటలు పార్క్‌కు కేటాయించారు. ఆ తర్వాత కొన్నాళ్లకు అందులోనూ ప్లాట్లు చేశారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో గత నెల 31న హైడ్రా చర్యలు చేపట్టింది. పార్క్ స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ వేసి, బోర్డులు పెట్టింది.

## రహదారులకు రాచబాట


బాచుపల్లిలో ప్రణీత్ ఆంటీల్యా గేటెడ్ కమ్యూనిటీలో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

హైదరాబాద్‌లో ఆఖరికి రోడ్లు కూడా కబ్జాలకు గురవుతున్నాయి. కబ్జాదారులు రోడ్లను ఆక్రమించి తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి షాపులు పెడుతున్నారు. కొందరు ఇళ్లు కూడా కడుతున్నారు. ఇలాంటి ఫిర్యాదులు పెరగడంతో హైడ్రా చర్యలు తీసుకుంటున్నది.

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం బౌరంపేట గ్రామ పరిధిలో గండిమైసమ్మ–మియాపూర్ ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి ఆక్రమణలకు పాల్పడి తాత్కాలిక షెడ్లు వేశాడు. వాటిని అద్దెకు ఇచ్చాడు. హైడ్రాకు ఫిర్యాదు రావడంతో గత నెల 31న ఆ షెడ్లను తొలగించింది.
- హైదరాబాద్ శివారు బాచుపల్లిలో ప్రణీత్ ఆంటీల్యా పేరుతో వెంచర్ ఏర్పాటు చేశారు. అందులో విల్లాలు నిర్మించారు. నిర్వాహకులు దాన్ని గేటెడ్ కమ్యూనిటీగా పేర్కొంటూ రహదారికి అడ్డంగా భారీ గోడ నిర్మించారు. దీంతో మల్లంపేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ 4 నుంచి ప్రగతి నగర్ వెళ్లాల్సిన వాహనదారులు అదనంగా 5 కి.మీ. ప్రయాణించాల్సి వచ్చింది. దీనిపై ఫిర్యాదు అందడంతో హైడ్రా గత నెల 9న రంగంలోకి దిగి గోడను కూల్చి వేసి, పబ్లిక్‌కు రోడ్డును అందుబాటులోకి తెచ్చింది.
- సికింద్రాబాద్‌లోని న్యూబోయిగూడలో రోడ్డును ఆక్రమించి కడుతున్న ఇల్లును ఈ నెల 8న హైడ్రా కూల్చి వేసింది.

## ప్రభుత్వ భూములకు విముక్తి

హైదరాబాద్ చుట్టూ వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. సిటీ పెరుగుతున్న క్రమంలో అవి కబ్జాలకు గురయ్యాయి. పాలకులు పట్టించుకోకపోవడంతో రూ.కోట్ల విలువైన భూములు కబ్జాదారుల పాలయ్యాయి. ఇప్పుడు హైడ్రా రావడంతో ప్రభుత్వ భూములు ఒక్కొక్కటిగా కబ్జాదారుల చెర వీడుతున్నాయి. ఇప్పటికే పలు భారీ ఆపరేషన్లు చేపట్టిన హైడ్రా.. రూ.వేల కోట్ల భూములను కాపాడింది. వాటి చుట్టూ ఫెన్సింగ్ వేసి, బోర్డులు పాతింది.

- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో ఈ నెల 11న హైడ్రా మెగా ఆపరేషన్ చేపట్టింది. రూ.15 వేల కోట్ల విలువైన 861 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. అందులోని ఆక్రమణలను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఇక్కడ స్థానిక బీఆర్ఎస్ లీడర్లు ముఖీం, అజీమ్ 42.20 ఎకరాలను కబ్జా పెట్టారు. ముఖీం 42 ఎకరాలను ఆక్రమించి గెస్ట్‌హౌస్, ఫామ్‌హౌస్ కట్టుకుని చుట్టూ కంచె వేశాడు. అతని సోదరుడు అజీమ్ 2.20 ఎకరాలను కబ్జా పెట్టి, 6 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మించాడు. ఈ నిర్మాణాలన్నింటినీ హైడ్రా తొలగించింది.
- గత నెల 20న హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని టీఎన్జీవో కాలనీలో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.3,200 కోట్లు. ఆక్రమణలన్నీ తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది.
- 2026 ఫిబ్రవరి 21న కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.1,400 కోట్లు. ఇక్కడ పార్కులు, విద్యాసంస్థలకు కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఫిర్యాదులు రావడంతో వాటిని తొలగించింది.


ఐలాపూర్‌లో హైడ్రా కూల్చేసిన ఫామ్‌హౌస్

# కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం

హైడ్రా తీరుపై హైకోర్టు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవడం, వారాంతాల్లో కూల్చివేతలు చేపట్టడం, కోర్టు వివాదాల్లోని భూములను స్వాధీనం చేసుకోవడంపై ఫైర్ అయింది. అనధికార నిర్మాణాలైనా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారని, బాధితులు కోర్టులకు రాకుండా వారాంతాల్లో కూల్చివేతలు చేపడుతున్నారా? అని ప్రశ్నించింది. కోర్టు వివాదాల్లోని స్థలాల స్వాధీనంపై స్పందిస్తూ.. "హైకోర్టు కంటే ఎక్కువ అని హైడ్రా భావిస్తున్నదా? సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నదా?" అని సీరియస్ అయింది. "అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? అధికారులు కండ్లు మూసుకుని ఉంటే, ఇలాగే అక్రమ నిర్మాణాలు వెలుస్తాయి. వాటిని తొలి దశలోనే అడ్డుకుని ఉంటే, కూల్చివేతల దాకా వచ్చేది కాదు కదా! అధికారులు ఇంతకాలం ప్రేక్షకపాత్ర పోషించి, మౌనంగా ఉండిపోయి, ఇప్పుడు మొద్దు నిద్ర లేచి, అనధికార నిర్మాణమని చెప్పి కూల్చివేయడం ఏంటి?" అని చురకలు అంటించింది. హైడ్రాకు సంబంధించిన విధివిధానాలు, మార్గదర్శకాలు సమర్పించే వరకు.. ఏ ప్రాంతంలో అయినా ఎలాంటి అనధికార నిర్మాణమైనా కూల్చివేయడానికి వీల్లేదని ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చెరువులు, నీటి వనరులు, నాలాలు, పార్కులు, ప్రజా రహదారుల పునరుద్ధరణ విషయంలో మాత్రం మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది.





# ప్రశంసలు.. విమర్శలు

హైడ్రాపై ఓవైపు ప్రశంసలు, మరోవైపు విమర్శలు రెండూ ఉన్నాయి. హైడ్రా మొదట్లో బడా బాబుల ఆక్రమణలపై దృష్టిపెట్టింది. కబ్జాదారుల చెర నుంచి చెరువులు, కుంటలు, పార్కులు, నాలాలు, రహదారులను కాపాడింది. దీంతో ప్రజల నుంచి హైడ్రాకు మద్దతు లభించింది. హైడ్రా పనితీరును మెచ్చుకుంటూ జనం ర్యాలీలు కూడా చేశారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వ భూములు, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో పేదలు, మధ్యతరగతి ప్రజలు నిర్మించుకున్న ఇండ్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడంతో హైడ్రాపై వ్యతిరేకత మొదలైంది. ఏండ్లకేండ్లుగా ఇక్కడే ఉంటున్నామని, ఇలా ఉన్నపళంగా ఇండ్లను కూల్చివేస్తే ఎక్కడికి వెళ్లాలని బాధితులు కన్నీళ్లు పెట్టుకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ టైమ్‌లో ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు గుప్పించాయి. ప్రభుత్వం పెద్దలను వదిలి పేదలపై ప్రతాపం చూపుతున్నదని మండిపడ్డాయి.

- హైడ్రా పేరుతో కాంగ్రెస్ సర్కార్ 'బుల్డోజర్ రాజకీయం' చేస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లకు మార్కింగ్ చేసినప్పుడు, అక్కడికి వెళ్లి బాధితులతో మాట్లాడారు.
- కాంగ్రెస్ పాలన నిజాం కంటే ఘోరంగా ఉన్నదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ నీతి ప్రదర్శిస్తున్నదని బీఆర్ఎస్ లీడర్ కేటీఆర్ విమర్శించారు. సర్కార్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. సామాన్యుల ఇళ్ల కంటే ముందు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల అక్రమ కట్టడాలను కూల్చివేయాలని సవాల్ విసిరారు. పలువురు మంత్రులు, కాంగ్రెస్ లీడర్ల ఫామ్‌హౌస్‌లు బఫర్ జోన్లలో ఉన్నాయని ఆరోపించారు.

# సహాయక చర్యల్లోనూ హైడ్రా..

హైడ్రా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సేవలు కూడా అందిస్తున్నది. వరదలు వచ్చినప్పడు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పడు సహాయక చర్యలు చేపడుతున్నది. వర్షాకాలంలో మాన్సూన్ టీమ్స్‌ను రంగంలోకి దింపుతున్నది. ఈ టీమ్స్ వరదలు వచ్చినప్పడు ముంపు కాలనీల్లోని బాధితులకు అండగా నిలుస్తున్నాయి. వాళ్లను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. కాలనీలు, రోడ్లపై నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నాయి. గాలిదుమారానికి రోడ్లపై కూలిపోయిన చెట్లను తొలగిస్తున్నాయి. సిటీలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే హైడ్రా టీమ్స్ వెంటనే అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నాయి.



గాలిదుమారానికి రోడ్లపై కూలిపోయిన చెట్లను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది



# హైడ్రా టోల్ ఫ్రీ నెంబర్ 1070

ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ '1070'ను హైడ్రా అందుబాటులోకి తెచ్చింది. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే ఈ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో చెట్లు పడిపోవడం, వరదలు, అగ్ని ప్రమాదాల వంటి ప్రమాదకర పరిస్థితుల్లో హైడ్రా సేవల కోసం సంప్రదించవచ్చు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం 87124 06899 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలి. ఫిర్యాదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను వాట్సాప్ ద్వారా ఈ నెంబర్‌కు పంపవచ్చు. ఓఆర్ఆర్ పరిధిలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో, భారీ వర్షాల వల్ల కాలనీలు, రహదారులు నీటమునిగినా లేదా అగ్ని ప్రమాదాలు జరిగినా 87124 06901, 90001 13667 నెంబర్లలో సంప్రదించవచ్చు.




## వారానికోసారి ప్రజావాణి..

హైదరాబాద్‌లోని హైడ్రా కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భూములు, పార్కులు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాలు సహా ఇతర ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాల ఆక్రమణకు సంబంధించి స్థానికులు ఫిర్యాదులు అందజేస్తున్నారు. ఆ కంప్లయింట్ల ఆధారంగా హైడ్రా చర్యలు తీసుకుంటున్నది. ప్రజావాణికి అనూహ్య స్పందన వస్తున్నదని హైడ్రా అధికారులు చెబుతున్నారు. ప్రతివారం 30 నుంచి 50 వరకు ఫిర్యాదులు అందుతున్నాయని అంటున్నారు.

## కబ్జాదారుల గుండెల్లో గుబులు

హైడ్రా రాకతో కబ్జాదారుల గుండెల్లో గుబులు పుట్టింది. ఆక్రమణలు ఒక్కొక్కటిగా తొలగిస్తుండడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. కబ్జాదారుల్లో ఎక్కువ మంది బడా బాబులే ఉన్నారు. హైదరాబాద్ శివార్లలోని చెరువులు, కుంటలను చెరబట్టి ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు నిబంధనలు ఉల్లంఘించి ఫామ్‌హౌస్‌లు, రిసార్టులు కట్టడంతో పాటు లేఅవుట్‌లు వేశారు. ప్రభుత్వ భూములు, పార్కులను కబ్జా పెట్టారు. వీటిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండడంతో హైడ్రా భారీ ఆపరేషన్లు చేపడుతున్నది. ఇప్పటికే గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, అమీన్‌పూర్, గండిపేట, హాఫీజ్‌పేట్, మణికొండ, అల్వాల్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించింది.

## కబ్జాదారుల వెన్నులో వణుకు పుట్టాలి..

ప్రకృతిని మనం కాపాడితేనే, అది మనకు రక్షణగా ఉంటుంది. లేదంటే కాలుష్యం, వరదలతో ఇబ్బందిపడాల్సి వస్తుంది. ముంబై, చెన్నై, ఢిల్లీలో వరదలు వస్తే స్కూళ్లకు సెలవులు ఇవ్వాల్సి వస్తున్నది. అలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకూడదనే హైడ్రా ఏర్పాటు చేశాం. హైడ్రా పేరు చెప్పగానే కబ్జాదారులకు వెన్నులో వణుకు పుట్టాలి. చెరువులు, నాలాలు, పార్కులు, క్రీడా ప్రాంగణాలు, ప్రభుత్వ భూములు అనే తేడా లేకుండా ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేసేద్దామనే ఆలోచన చేసేవారికి హైడ్రా ఉందనే భయం ఉండాలి. కబ్జాదారులు ఎంతటివారైనా సేరే కఠినంగా వ్యవహరించాలి. పేదల విషయంలో సానుభూతితో ఉండాలి. పేదల ఆక్రమణలు తొలగించాల్సి వస్తే, వాళ్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

- సీఎం రేవంత్ రెడ్డి






కొండాపూర్‌లో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని హైడ్రా వేసిన ఫెన్సింగ్